వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

రెండు మండలాల గ్రామాలను అనుసంధానం చేసే వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి రెండున్నరేళ్లు గడిచినా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. వంతెనతో పాటు రోడ్డు విస్తరణ పనులు కూడా ముందుకు సాగడంలేదు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పిల్లోనిగూడ శివారులో ఎంటేరువాగుపై నిలిచిపోయిన వంతెన పనులు

- రోడ్డు విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం
- వాహనదారులకు తప్పని తిప్పలు

శంషాబాద్ రూరల్: మండలంలోని రాయన్నగూడ చౌరస్తా నుంచి పాల్మాకుల వరకు 5 కి.మీ దూరం రోడ్డు విస్తరణతో పాటు పిల్లోనిగూడ సమీపంలో ఎంటేరువాగుపై వంతెన నిర్మాణం చేపట్టారు.

రూ.7 కోట్లతో పనులు..

వంతెనతో పాటు రోడ్డు విస్తరణ కోసం సుమారు రూ. 10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో రూ.7 కోట్లను కేటాయించారు. ఈ నిధుల్లో వంతెన కోసం రూ.3.5 కోట్లు వెచ్చించాల్సి ఉంది. శంషాబాద్-షాబాద్ రహదారి, బెంగళూరు జాతీయ రహదారులను అనుసంధానం చేసే ఈ రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో అవస్థలు తప్పడంలేదు.



ననాజీపూర్ రోడ్డు విస్తరణ పనులు ఇలా..

రెండున్నరేళ్ల క్రితం శంకుస్థాపన..

ఈ పనులకు 2021 జూలైలో శంకుస్థాపన చేశారు. ఇన్నేళ్లు గడిచినా పనులు నత్తనడకన సాగి అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డు విస్తరణ కోసం కేవలం కల్వర్టు పనులు మాత్రమే పూర్తి చేశారు. ఇక వంతెన కోసం పిల్లర్లు వేసి వదిలేశారు.

వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది..

వర్షాకాలంలో వంతెన పనులకు ఆటంకాలు ఎదురుకావడంతో పాటు కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో జనాలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ ఏడాది జనవరిలోపు వంతెన పనులను పూర్తి చేయాల్సి ఉండగా.. పిల్లర్ల వరకు పరిమితం కావడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరదనీటితో తంటాలు..

వర్షాకాలంలో వరదనీటితో ఎంటేరువాగు పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. పిల్లోనిగూడ-మక్తగూడ మధ్యలో రాకపోకలు పూర్తి నిలిచిపోతుంటాయి. దీంతో శంషాబాద్, కొత్తూరు, చేవెళ్ల, షాబాద్ మండల వాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాగుపై స్థానికులు, దాతల సహకారంతో తాత్కాలికంగా బండరాళ్లు ఏర్పాటు చేసి రాకపోకలు సాగిస్తున్నారు. ఏళ్ల నుంచి ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో పాటు వంతెన పనుల్లో జాప్యంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పనులు అంతంతే..

రోడ్డు విస్తరణ పనులు కూడా అసంపూర్తిగా ఉండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. బీటీరోడ్డు మట్టి రోడ్డుగా మారిపోయి దుమ్ము, దూళితో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కల్వర్టుల నిర్మాణం సమయంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి.

బీఆర్‌ఎస్‌కు ఝూన్సీ ఉమారెడ్డి రాజీనామా

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ సీనియర్ మహిళా నాయకురాలు, జీహెచ్‌ఎంసీ మాజీ వార్డు సభ్యురాలు ఝాన్సీ ఉమారెడ్డి గురువారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు ధర్మారెడ్డికి అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. త్వరలో తన రాజకీయ భవిష్యత్తుపై చర్చించి ప్రకటిస్తానన్నారు. ఎన్నికల వేళ ఆమె రాజీనామా చర్చనీయంగా మారింది.

బీజేపీ ఎన్నికల ప్రచారం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ బూత్ నెంబర్ 201, 202ల్లో డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయి యాదవ్ బూత్ కార్యకర్తలు, నాయకులతో కలిసి రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డికి తమ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని హైదర్‌గూడ గ్రామస్థులు ఓటర్లను అభ్యర్థిస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కొంగ్ల నవీన్, మ్యాడం రాములు, బాలకృష్ణ, విపిన్, నర్సింగ్, బంటు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పోలింగ్ బూత్‌లు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలో కొత్తగా 7 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. కొత్త పోలింగ్‌బూత్‌తో పోలింగ్ బూత్‌ల సంఖ్య 542కు చేరింది. ఓటర్ల నమోదుకు చివరి అవకాశం ఇవ్వడంతో పెద్దఎత్తున ఓటర్లు తమ పేరును దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నియోజకవర్గంలో దాదాపు 26 వేల కొత్త ఓటర్లు నమోదయ్యారు. దీంతో ఆయా పోలింగ్ బూత్‌లో 1500 కంటే ఎక్కువగా ఓటర్లుగా నమోదయ్యారు. ఎక్కువగా ఓటర్లను గుర్తించే ఈ పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో నాలుగు, గండిపేట్ మండల పరిధిలో మూడు కొత్త పోలింగ్ బూత్‌లు ఏర్పాటయ్యాయి.

ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులు



ఆకస్మిక తనిఖీ చేస్తున్న రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్‌లు అందించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్‌లలోని కాలనీలలో ప్రజలకు డీఎల్‌ఓలతో ప్రతి ఒక్కరికి ఓటరుస్లిప్‌లు అందజేసిన వారిని ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ డీసీ రవికుమార్ మాట్లాడుతూ.. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ ఇళ్లలోని ప్రజలకు ఓటరు స్లిప్‌లు అందించడంపై తనిఖీ చేశామన్నారు. ఓటువేసే సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలన్నారు. అందుబాటులో లేని వారు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వారం రోజులపాటు నిర్వహిస్తున్నామని వివరించారు. డీఆర్‌డీఓ ప్రభాకర్, డీపీఓ రాధారాణి, సీఓ విజేందర్ తదితరులున్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో సీబీఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకున్న ఇరు సంస్థల ప్రతినిధులు

మణికొండ: సీబీఐటీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్యానికి మేలు చేసేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారితో గురువారం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీవీ నరసింహులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి వంశీకృష్ణలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మానసికంగా ప్రశాంతంగా, దృఢంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. విద్యార్థులకు వారి తరగతులను అందజేసి వారిని మరింత తీర్చిదిద్దుతామన్నారు. సీనియర్ ప్రొఫెసర్ సురేష్‌బాబు, సంస్థ ప్రతినిధి శ్రీకృష్ణ తదితరులున్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం



జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రియాంక

శంషాబాద్: విద్యాసంస్థల్లో చదువుతో పాటు క్రీడలు సమాంతరంగా నిర్వహించాలని బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారిణి నవ్యరావు అన్నారు. ఎస్‌ఈఏ మిషన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను గురువారం వైఎస్‌ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. క్రీడలు ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తాయని, విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ఆటలపోటీలు నిర్వహించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ఆనంద్, మోర్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాస్, కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.

మారుతున్న ఆహారపు అలవాట్లతో మధుమేహం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మజహర్‌ఉల్లా

గోల్కొండ: మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా మధుమేహం బారిన ఎందరో పడుతున్నారని ప్రముఖ డయాబెటాలజిస్టు, గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజర్‌ఉల్లా అన్నారు. గురువారం గోల్కొండ కోట వద్ద తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టాక్ ఫర్ హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది పర్యాటకులు, 30 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహం అనేది తల్లిదండ్రుల ద్వారా సంక్రమించే అవకాశం ఉందని అన్నారు. ఎక్కువ శాతం మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆహారపు అలవాట్లు, ఆహారపు నియమాలు పాటించకపోవడం వల్ల వ్యాధి బారిన పడుతున్నారని అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, డాక్టర్ ఖరీమ్, ఖాలేద్ ఆలీ ఖాన్ పాల్గొన్నారు.

అక్క దగ్గరకు వెళ్తున్నానని..అదృశ్యం

మొయినాబాద్: అక్క దగ్గరకు వెళ్లొస్తానని ఇంటినుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ ఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన బైండ్ల రాజు ఈ నెల 8న జీడిమెట్లలోని సూరారంలో ఉండే తన అక్క వద్దకు వెళ్లాడు. 11న తిరుగు ప్రయాణమై మొయినాబాద్‌కు చేరుకోలేదు. దీంతో భార్య హంసమ్మ ఫోన్ చేయగా.. ఇంటికి వస్తున్నాననే చెప్పాడన్నారు. నేటికి తిరిగి ఇంటికి రాలేదని 13వ తేదీ వరకూ అతని ఫోన్ రింగ్ అయ్యిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని పోలీసులకు ఫిర్యాదులో వారు తెలిపారు. పరిసర ప్రాంతాలు, బంధువులు , స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు అయ్యప్ప మహా పడిపూజ

గౌలిపురా: గౌలిపురా భరతమాత ఆలయం సమీపంలో ఈనెల 18న అయ్యప్ప మహా పడి పూజా కార్యక్రమాన్ని నిర్వాహకులు బొడ్డు సాయిబాబా తెలిపారు. జగదీష్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పూజలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అమ్డాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక అన్నారు. గురువారం అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సం నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేణుక మాట్లాడుతూ విద్యార్థులు ధైర్య సాహసాలతో ముందుకు వెళ్లినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఉపాధ్యాయులకు అన్ని రంగాల్లో అవగాహన ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలుగుతామని తెలిపారు.

మాట నిలబెట్టుకున్నాం



మొయినాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

మొయినాబాద్: చేవెళ్ల నియోజవర్గానికి సంబంధించి గత ఎన్నికల్లో 111 జీఓను ఎత్తేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. అయితే కొంతమంది రాజకీయ స్వార్థం కోసం 111 జీఓపై కోర్టులను ఆశ్రయించారని.. వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకు మద్దతుగా గురువారం మొయినాబాద్‌లో కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలో కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది, షాబాద్ మండలం చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో మరిన్ని ఫ్యాక్టరీలు రాబోతున్నాయన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడని.. ఎప్పుడు సీఎంను కలిసినా నియోజవకర్గం అభివృద్ధి కోసమే మాట్లాడుతారన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి ఆయుధాలు సరఫరా చేసే కేసులో నిందితుడని ఆరోపించారు. ఆయుధాలు సరఫరా చేసేవాళ్లు కావాలా..? గంగిగోవులాంటి కాలె యాదయ్య కావాలా ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. కారు గుర్తుకు ఓటువేసి యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఆపొద్దు !



ప్రకాష్‌గౌడ్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మణికొండ: వచ్చే ఐదేళ్లలో అభివృద్ధి మరింత పరుగులు పెడుతుందని, దాన్ని ప్రజలు ఇతరుల మాటలు విని ఆపొద్దని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గొలిదొడ్డి, వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట, మంచిరేవుల, నార్సింగి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్.నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంగళహారతులతో స్వాగతం..

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామ గ్రామాన ఆయనకు మంగళహారతులతో స్వాగతం పలికారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు

మణికొండ: ప్రపంచమంతా మెచ్చుకునే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఓటువేసి తమకు నచ్చిన నాయకున్ని ఎన్నుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి ఎ. భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినిలకు ఆయన ఓటు విలువను తెలియజేశారు. తొలిసారి ఓటుహక్కు పొందిన విద్యార్థినులు ఉన్నత విలువలు ఉన్న నాయకులకు ఓటు వేసి ప్రజా ప్రతినిధులుగా గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రొఫెసర్ సుబ్బరంగయ్య, ప్రిన్సిపల్ ఎ.నర్మద పాల్గొన్నారు.

బీజేపీని ఓడించేందుకే కుట్ర

ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు ఏకమై ప్రజా క్షేత్రంలో బీజేపీని ఓడించేందుకు కుట్రపూరితమైన రాజకీయాలు చేస్తున్నాయని రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసదుద్దీన్ నివసిస్తున్న శాస్త్రీపురం ఎప్పటికైన నియోజకవర్గం ఏర్పడే విధంగా బీఆర్‌ఎస్ పార్టీతో ఎంఐఎం లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నదన్నారు. రాజేంద్రనగర్ అభ్యర్థిగా ప్రతిసారి ముస్లిం అభ్యర్థికి టికెట్ ఇచ్చేవారని, ఈసారి ప్రకాష్‌గౌడ్‌ను గెలిపించుకోవడానికే డమ్మి అభ్యర్థికి టికెట్ ఇచ్చి రాజేంద్రనగర్‌ను బీఆర్‌ఎస్ కైవసం చేసుకోవడానికి కుట్ర పన్నిందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిస్తే వచ్చే ఎన్నికల్లో డీలిమిటేషన్‌లో భాగంగా శాస్త్రీపురం నియోజకవర్గం ఏర్పడే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఓ పక్క కాంగ్రెస్ అభ్యరితో కూడా లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని కాంగ్రెస్ కౌన్సిలర్లను బీఆర్‌ఎస్ పార్టీలో చేర్పిస్తున్నారన్నారు. వచ్చే ఎలక్షన్ నాటికి డీలిమిటేషన్ కింద రాజేంద్రనగర్ నియోజకవర్గం రెండుగా మారుతుందన్నారు. ముస్లిం జనాభా ఉన్న సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, రాజేంద్రనగర్, అత్తాపూర్‌తో పాటు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను కలుపుకుని శాస్త్రీపురం నియోజకవర్గం ఏర్పాటు చేయడానికి అంతర్గతంగా చర్చలు జరుపుతున్నారన్నారు. ప్రజలు గొర్రెలు కారని నియోజకవర్గంలో యువత ఆలోచించి అభివృద్ధి చేసేవారికే ఓటు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు తోకల శ్రీశైలంరెడ్డి, తలారి అశోక్, దేవులపల్లి స్వామి, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

మార్నింగ్ వాక్ వినూత్న ప్రచారం..

అత్తాపూర్: బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి వినూత్నంగా మార్నింగ్ వాక్‌లో ప్రచారం మొదలు పెట్టారు. ఉదయం నడకలో ఉండే పలువురు సీనియర్ సిటిజన్‌లను కలిసి తన గురించి, తమ పార్టీ గురించి వివరిస్తూ.. నియోజకవర్గ సమస్యలపై ఆరా తీశారు. తనను గెలిపిస్తే వాటిని ఎలా పరిష్కరిస్తాననే విషయాన్ని వివరించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల కంటే తాను ఎలా మెరుగైన అభ్యర్థి అవుతానో వివరిస్తూ ప్రచారం సాగిస్తున్నారు.

తప్పుడు హామీలతో మోసపోవద్దు !

బండ్లగూడ: బీజేపీ, కాంగ్రెస్‌లు తప్పుడు హామీలు ఇస్తూ.. ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాయని దీనిని ప్రజలే తిప్పికొట్టాలని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రావుకోళ్ల నాగరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు తదితర ప్రాంతాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సహకారంతోనే బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కట్ట సాయిబాబాగౌడ్, ఖాజాపాషా, పీరంచెరువు వాసులు, ప్రజలు తదితరులున్నారు.

అత్తాపూర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం..

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓల్డ్ విలేజ్ పోచమ్మ టెంపుల్ బస్తీ, హనుమాన్ టెంపుల్ బస్తీ, రతన్‌నగర్ కాలనీ, భరత్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కారు గుర్తుకు ఓటు వేయాలని చెబుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్ వనం శ్రీరామ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి, సుహాస్ రెడ్డి, అమరేందర్, సురేష్‌రెడ్డి, చిట్టిగారి చిన్న, జాలిగం చిత్తారి, కె.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సూరంపల్లిలో..

రాజేంద్రనగర్: సూరంపల్లిలో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారానికి కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ హాజరయ్యారు. పార్టీ సీనియర్ నాయకులు బండారి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు పడమటి శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రకాష్‌గౌడ్ గెలుపును ఆపలేరు..

రాజేంద్రనగర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ గెలుపును ఎవరూ ఆపలేరని డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉప్పర్‌పల్లిలో వీరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ విజయం కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలవాలని ప్రతిజ్ఞ చేసి స్థానిక నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి, ఆదిరాల పరమేష్, అనుముల జాన్‌పాల్, రగడంపల్లి శ్రావణ్‌కుమార్, సాయిగౌడ్, ప్రీతమ్‌రాజ్, యాదమ్మ, నరేష్ , శ్రీవర్ధన్‌రెడ్డి, పట్నం నరేష్, గిరి, రఘు ముదిరాజ్, నారాయణ స్వామి, సుబ్బారావు, వీర్లపల్లి మహేష్, నవీన్, ఉమా రెడ్డి, శివకుమార్, శివగౌడ్, పచ్చ శ్రీనివాస్, సాయిగౌడ్, సాయి మల్లిక్, కోరని రవీందర్, సుమలత, సుజాతగౌడ్, మంజుల, జబీన్ హుస్సేన్, నందిగామ నర్సింహ, ప్రకాష్, బండ్ల నరేందర్, ఫయాజ్, రియాజ్, అహ్మద్ కాటి దేవేందర్ తదితరులున్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి కాంగ్రెస్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధి బుద్వేల్ ప్రాంతంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి కోరని బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల బూత్ నాయకులను ఎన్నుకున్నారు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు పాల్గొని కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఆకర్షితులు చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షులు బొక్కా ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్, శ్యామ్, నరేందర్, పెండ్యాల శ్రీధర్, సీహెచ్.అమర్‌నాథ్, కిరణ్‌యాదవ్, యాదయ్య , కోరని సదానంద్, కుమార్, అంశమ్మ, ఝాన్సీ, హరి, వినోద్‌చారి, ఎండీ సమీర్, పడకంటి రాజు, అవంతి తదితరులున్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

గోల్కొండ: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి కూడా కార్వాన్ నియోజకవర్గం నుంచి తన గెలుపు ఖాయమని ప్రజల ఆదరాభిమానాలు తనకు మెండుగా ఉన్నాయని చెప్పారు. కొత్త అసెంబ్లీ మొదటి సమావేశంలోనే దివ్యాంగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి ఇచ్చే పింఛన్లను కూడా పెంచాలని తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్నారు. కార్వాన్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే తనను గెలిపించాలని కోరారు. నానల్‌నగర్ కార్పొరేటర మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, వాజీఉజ్‌జమా తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

సుల్తాన్‌బజార్: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఖైరతాబాద్ జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం కోఠిలోని యూపీహెచ్‌సీలో కింగ్‌కోఠి క్లస్టర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య అధికారులకు, పీహెచ్‌ఎన్‌లకు, స్టాఫ్ నర్సులకు, ఏఎన్‌ఎంలకు, ఫార్మసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, డీఈఓలకు వారు చేయాల్సిన విధులపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ విజయలక్ష్మి, డాక్టర్ మనోజ్‌రెడ్డిలతో పాటు వివిధ క్యాడర్ల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

సుల్తాన్‌బజార్: రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ సెంటర్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. గురువారం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహన ప్రయాణంలో నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతుందని ఆయన అన్నారు. ర్యాష్ డ్రైవింగ్, మత్తుపదార్థాలు సేవించడం, డ్రంకన్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే అనార్థాలను విద్యార్థులకు ఆడియో రూపంలో అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్మయి, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్ గౌడ్, ఉపేందర్‌రెడ్డి, అనిల్, బాబురావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు